అక్షర దర్బార్
Voice of the people
www.aksharadarbar.com

## 12న గ్రాండ్ ఫ్యాషన్ షో

- అంబేద్కర్ భవన్‌లో వేదిక.. ట్రైసిటీ ప్రజలకు అవకాశం
- చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంట్రీ
- పోస్టర్ విడుదల చేసిన నిర్వాహకులు

04




శనివారం 11, జూలై 2026 సంపుటి :03 సంచిక :145 పేజీలు :05 వెల ₹5



"రాసిపెట్టుకోండి.. ఈ రోజు 2026 జూలై 10న నేను చెబుతున్న మాట ఖచ్చితంగా జరిగి తీరుతుంది. పెరిగే 182 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ రెండోసారి జయకేతనం ఎగురవేసి మళ్లీ అధికారంలోకి వస్తుంది. ఇది భద్రాచలం రాముడిపై ఆన.. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రతిజ్ఞ."

- సీఎం రేవంత్ రెడ్డి

# భద్రాద్రి రాముడిపై ఆన

05

### వచ్చే ఎన్నికల్లో 117 స్థానాల్లో గెలిచేది కాంగ్రెస్సే

- 2028 డిసెంబర్‌లో ఎన్నికలు ఉండవు.. 2029 జూన్‌లోనే పోలింగ్
- తెలంగాణలో పెరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు..
- ఎంపీ సీట్లు 26, ఎమ్మెల్యే సీట్లు 182కు పెంపు
- కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం
- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు
- పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కే పరిమితం చేశాం.. రాబోయే కురుక్షేత్రంలో గెలుపు మనదేనని ప్రకటన
- రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని వెల్లడి

రాష్ట్రంలో ముందస్తు ఊహాగానాలకు తెరదించుతూ, భవిష్యత్ ఎన్నికలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో నిర్వహించిన "రైతు ఆశీర్వాద సభ" లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా తుది విడత నిధుల విడుదల, ఈ-పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు.

- అక్షరదర్బార్, ఖమ్మం




## ప్రణాళికతోనే సుస్థిర అభివృద్ధి

- సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

05

## అభివృద్ధిలో అశ్రద్ధ వద్దు



- వరంగల్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం
- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1 కోటితో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

04




# విద్యాసంస్థల బంద్ విజయవంతం

- జన్ను రమేష్
- రాష్ట్రంలో ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం విడ్డూరం
- వామపక్ష సంఘాలు

అక్షరదర్బార్, నర్సంపేట : విద్యారంగం పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ చెన్నారావుపేట మండల కేంద్రంలో ఏఐఎఫ్డీఎస్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్డీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొమ్ముక రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో, గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, అతిరం, అంజి పాల్గొన్నారు.

## చిన్నారి ప్రవస్తిని ఆశీర్వదించిన బీజేపీ నేత రాణా ప్రతాప్ రెడ్డి

అక్షరదర్బార్, నర్సంపేట : చెన్నారావుపేట మండల యువమోర్చా జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు బావమరిది కుమార్తె కూస ప్రవస్తి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకకు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారికి నూతన వస్త్రాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల, జిల్లా స్థాయి వివిధ మోర్చాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెండింగ్ డీఏలను విడుదల చేసి
# పీఆర్సీని ప్రకటించాలి

- పెండెం రాజు



అక్షరదర్బార్, నడికూడ : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యాన్ని (డీఏ) విడుదల చేసి, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వరికోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సభ్యత్వ నమోదు సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ అమలుకు 36 నెలలు గడిచినా నివేదికను బహిర్గతం చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల సిబ్బందికి హెల్త్ కార్డులు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి మెరుగు ప్రసన్న ఆనంద్, మండల అధ్యక్షుడు రవీందర్, పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.



# హనుమకొండ జిల్లా డీఎంహెచ్‌వోగా డాక్టర్ అప్పయ్య బాధ్యతలు

అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా డాక్టర్ ఏ. అప్పయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.




# పరకాలలో ఎస్ఎఫ్ఐ విద్యాసంస్థల బంద్ విజయవంతం

- బొచ్చు కళ్యాణ్

అక్షరదర్బార్, పరకాల : రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఇచ్చిన పిలుపులో భాగంగా పరకాల పట్టణంలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న విద్యాశాఖ మంత్రి, డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందలేదని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బంద్‌కు పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్, ఇస్మాయిల్, సాయితేజ పాల్గొన్నారు.

## మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా
# మారేపల్లి కట్టయ్య

అక్షరదర్బార్, శాయంపేట : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శాయంపేట మండల ఎస్సీ సెల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మారేపల్లి కట్టయ్య, ఉపాధ్యక్షుడిగా కోకిల జగన్, ప్రధాన సెక్రటరీగా ఆరె కమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించడంలో కార్యకర్తలు ముఖ్యపాత్ర పోషించాలని బుచ్చిరెడ్డి కోరారు. కార్యక్రమంలో దుబాసి కృష్ణమూర్తి, వైనాల కుమారస్వామి, శానం కుమారస్వామి పాల్గొన్నారు.





## చిన్నారి హరిణిని ఆశీర్వదించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల

అక్షరదర్బార్, పరకాల : హనుమకొండలోని శారద గార్డెన్స్‌లో వరంగల్ వాయిస్ జర్నలిస్టు ఉన్నగిరి శ్రీకాంత్-సృజన దంపతుల ప్రథమ పుత్రిక హరిణి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో హింగే మనోహర్‌రావు, డాక్టర్ మోటె చిరంజీవి, రమేష్, ప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



## మైలారం యాదవ కుల సంఘం అధ్యక్షుడిగా బత్తిని చిన్న తిరుపతి

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం మైలారం గ్రామంలో మల్లికార్జున యాదవ కుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బత్తిని చిన్న తిరుపతి, ఉపాధ్యక్షుడిగా బొంతల రవి, ప్రధాన కార్యదర్శిగా బొంతల కనకమల్లు, కార్యదర్శిగా కన్నెపిల్ల రమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బొంతల నాగరాజు, కొడారి మహేష్, బొంతల శ్రీను, పెరుగు చందు, గొల్ల చిన్న కుమార్ స్వామి నియమితులయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన కుల సంఘం పెద్దలకు, సభ్యులకు నూతన అధ్యక్షుడు చిన్న తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.




## ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం గోవిందాపూర్ గ్రామంలో సర్పంచ్ దాసి స్వాతి శ్రావణ్ కుమార్, ఉపసర్పంచ్ కాల్వల నరేందర్, పాలకవర్గం సహకారంతో రూ. 25 వేల విలువైన నాలుగు సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేష్ సమక్షంలో డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి గ్రామంలోని పెద్దలు, ప్రజలు భాగస్వాములై స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

# నిధులతో 14వ వార్డుకు కొత్త రూపు

- టీయూఎఫ్ఐడీసీ నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులు 95 శాతం పూర్తి
- ఎమ్మెల్యే రేవూరికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి



అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ 14వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ ప్రత్యేక నిధులతో రూ.కోటికి పైగా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. గత మూడు దశాబ్దాలుగా ప్రజలను వేధించిన అంతర్గత డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయడంతో వార్డు రూపురేఖలు మారాయని మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ తెలిపారు.శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆలయం పరిసరాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం, 2024లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. వాటికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, 2025లో టీయూఎఫ్ఐడీసీ ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమై ప్రస్తుతం 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు.పాత మసీదు గల్లీలో సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయిందన్నారు. ఈ రోడ్డు పనులకు గతంలో మున్సిపల్ అత్యవసర బడ్జెట్‌లో నిధులు కేటాయించి శంకుస్థాపన చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయని, అనంతరం ఎమ్మెల్యే అదే పనిని టీయూఎఫ్ఐడీసీ నిధులతో పూర్తి చేయించారని వివరించారు.ఈ అభివృద్ధి పనులతో వార్డు ప్రజలకు దీర్ఘకాలిక సమస్యల నుంచి ఉపశమనం లభించిందని, 14వ వార్డు చరిత్రలో నిలిచిపోయేలా రూ.కోటికి పైగా అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వార్డు ప్రజలు కూడా ఎమ్మెల్యే దూరదృష్టిని, మాజీ కౌన్సిలర్ నిరంతర కృషిని అభినందిస్తున్నారని పేర్కొన్నారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

### రూ.60వేలనగదు,బంగారం,వెండిబూడిద సర్వంకోల్పోయినకుటుంబం

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండలం అందుకు తండా గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దాసరి శ్యామల లక్ష్మీపతికి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్నిప్రమాదంలో ఇంట్లో దాచుకున్న రూ. 60 వేల నగదు, ఆరు తులాల బంగారం, 8 తులాల వెండితో పాటు వంట సామాగ్రి, బట్టలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాద తీవ్రతకు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులను ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆర్థికంగా ఆదుకోవాలని తండా ప్రజలు, గ్రామస్తులు కోరుతున్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- ఎస్ఐఆర్ నమోదుపై అసంతృప్తి

అక్షరదర్బార్, భూపాలపల్లి: ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్‌వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో అలసత్వం వహించే బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అలసత్వం వహిస్తే విధుల నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో ఎస్ఐఆర్ నమోదు 14 శాతానికి, ఇతర మండలాల్లో సుమారు 50 శాతానికే పరిమితమైందని అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, 10 శాతం కంటే తక్కువ నమోదు చేసిన బీఎల్‌వోలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల పురోగతిని నిశితంగా సమీక్షిస్తోందని, జాప్యం జరిగితే హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలు అందజేయడంతో పాటు వాటిని పూర్తి చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అవసరమైన చోట రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బందితో పాటు ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ఏజంట్లును సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోపు నమోదు ప్రక్రియను నూరు శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఎ ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# బూత్ వ్యవస్థను పటిష్టం చేస్తేనే ఎన్నికల్లో విజయం

- మానుకోట గడ్డపై కాషాయ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలి
- ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలి
- బీజేపీ గూడూరు మండల నాయకులు



అక్షరదర్బార్, గూడూరు : గ్రామస్థాయిలో బూత్ వ్యవస్థను పటిష్టం చేసుకుంటే ఎలాంటి ఎన్నికల్లోనైనా విజయం సాధించవచ్చని బీజేపీ మండల అధ్యక్షుడు తెలిపారు. గూడూరు మండలంలోని గుండెంగ గ్రామంలో మూడు బూత్‌ల అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మనుకోట గడ్డపై కాషాయ జెండా గెలుపు కోసం కార్యకర్తలందరూ పరస్పర సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేలా బీఎల్ఓలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియలో బీఎల్ఓలకు తమ పార్టీ తరపున బిఎల్ఏలు కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుండెంగ గ్రామ ఇన్‌ఛార్జ్ వాంకుడోత్ శ్రీనివాస్, బీజేపీ వార్డు సభ్యుడు బానోతు అరవింద్, సీనియర్ నాయకుడు బానోతు భాస్కర్, బూత్ అధ్యక్షులు జాటోత్ శ్రీధర్, తేజావత్ శ్రీకాంత్, బానోత్ రాకేష్ పాల్గొన్నారు.

# 12న గ్రాండ్ ఫ్యాషన్ షో

- అంబేద్కర్ భవన్‌లో వేదిక.. ట్రైసిటీ ప్రజలకు అవకాశం
- చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంట్రీ
- పోస్టర్ విడుదల చేసిన నిర్వాహకులు

అక్షరదర్బార్, హనుమకొండ: ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న నగరంలో ఒక భారీ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ నిర్వాహకులు వడ్డీ లలితా రావు, హసీనా సంయుక్తంగా ప్రకటించారు. శుక్రవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జరగబోయే ఈ ఫ్యాషన్ షోలో కాజీపేట, హనుమకొండ, వరంగల్ (ట్రైసిటీ) ప్రాంతాల వారికి ప్రత్యేకంగా అవకాశాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ షోలో పాల్గొనేందుకు వయోపరిమితి లేదని, విభిన్న కేటగిరీలలో పురుషులు, స్త్రీలు, గృహిణులు (హౌస్ వైఫ్స్), చిన్నపిల్లలు, వయోవృద్ధులు కూడా పాల్గొనవచ్చని వివరించారు.

– రూ. 999 ఎంట్రీ ఫీజు.. ప్రముఖుల సమక్షంలో షో

పోటీల్లో పాల్గొనదలచుకున్న మోడల్స్ కోసం ఒక్కొక్కరికి రూ. 999 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఫ్యాషన్ మరియు గ్లామర్ రంగంపై ఆసక్తి ఉన్న ట్రైసిటీ యువత, మహిళలు, చిన్నారులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మెగా ఫ్యాషన్ షోకు సినీ డైరెక్టర్లు, ప్రముఖ యూట్యూబర్లు, మోడలింగ్ రంగంలో నిష్ణాతులైన నిపుణులు ముఖ్య అతిథులుగా హాజరై అభ్యర్థులను ప్రోత్సహిస్తారని తెలిపారు. మోడలింగ్ రంగంలో రాణించాలనుకునే వారికి ఇదొక మంచి ప్లాట్‌ఫామ్ కానుందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ ప్రతినిధులు, నిర్వాహకులు వనజ, రోషిని, సనాత బస్సుమ్, మహిత పాల్గొన్నారు.




# భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఇంచార్జిగా డా. మడికొండ శ్రీను

అక్షరదర్బార్,పరకాల : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్సీ సెల్ ఇంచార్జిగా డాక్టర్ మడికొండ శ్రీనును నియమించారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కో–ఆర్డినేటర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి ఎస్సీ సెల్ కమిటీలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని డాక్టర్ మడికొండ శ్రీను పేర్కొన్నారు.



# గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- చిట్యాల మండలంలో రూ.3 కోట్ల విలువైన సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన
- తిరుమలాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం, జడలపేటలో ఆశా సెంటర్ ప్రారంభం
- బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని ఎమ్మెల్యే హామీ



అక్షరదర్బార్, చిట్యాల : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ పాలనలో గ్రామాలలో అభివృద్ధే ధ్యేయంగా అంకితభావంతో ముందుకు సాగుతున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. చిట్యాల మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం ఆయన రూ. 3 కోట్ల విలువైన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నైన్‌పాక – నేరేడుపల్లి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా తిరుమలాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, జడలపేటలో ఆశా సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. చల్లగరిగె, గుంటూరుపల్లి, ఏలేటి రామయ్యపల్లి, జడలపేట, బావుసింగ్‌పల్లి, కాల్వపల్లి, ఒడితల గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.

**బాధితులకు భరోసా..**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన అందుకు తండా గ్రామానికి చెందిన దాసరి శ్యామల లక్ష్మీపతి కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తక్షణమే ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో తహశీల్దార్ తూకుంట్ల వసంతరావు, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూట్ల తిరుపతి, కట్కూరి నరేందర్, చిలుకల రాయకొమురు, కామెడీ రత్నాకర్ రెడ్డి, రమేష్, నక్క భాస్కర్, అల్లకొండ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అశ్రద్ధ వద్దు

- వరంగల్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం
- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1 కోటితో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ నగరాన్ని ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలంటే అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం అత్యంత ముఖ్యమని, చిన్న తరహా పనులపైనా అధికారులు, కాంట్రాక్టర్లు అశ్రద్ధ చూపరాదని ఆయన స్పష్టం చేశారు.

**రూ.1 కోటితో పనుల ప్రారంభం**

శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్ (సహకార్ నగర్, రెవెన్యూ కాలనీ), అలాగే 9వ డివిజన్ (కాకతీయ కాలనీలోని సిక్కులవాడ) ప్రాంతాల్లో సుమారు రూ.1కోటి వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు.

**లక్ష్యం వైపు అడుగులు..**

ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ఒక్కో డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు ఆదర్శవంతమైన జీవన వాతావరణం కల్పించేందుకు తన కృషి నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాలనీవాసులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యత, పారదర్శకత ముఖ్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరంగల్ నగరం అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడబోదని స్పష్టం చేశారు. "నగరంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది." అని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజల సొమ్ముతో చేపట్టే ప్రతి పని నాణ్యతతో, పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. చిన్న పనులైనా ప్రజల దైనందిన జీవితాలతో ముడిపడి ఉంటాయని, ప్రతి పనిని బాధ్యతగా తీసుకుని పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులు పూర్తయితే కాలనీల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు కూడా మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి
- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్), నమోదు డిజిటలైజేషన్ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా, మార్పులు, చేర్పులు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపడుతున్నామని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయిలో బీఎల్ఓలకు సహకరిస్తూ, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్ ఓ శ్రీనివాస్, ఆర్డీఓలు వెంకట్, వెంకన్న, తహశీల్దార్లు ఎన్నికల శాఖ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన చేనేత సహకార సంఘం ఎన్నికలు

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట చేనేత సహకార సంఘంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.మండలంలోని చేనేత సహకార సంఘం ఎన్నికల ఓటింగ్ ఎన్నికల కమిటీలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 వరకు పోలింగ్ నిర్వహించి ఎన్నికల అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటించారు.మహిళా ఓపెన్ కేటగిరీలో విజేతలుగా బాసని ఉమాదేవి వలపదాసు స్వరూప ఎన్నికైనట్లు ప్రకటించారు.అనంతరం ఓపెన్ క్యాటగిరి గెలిచిన అభ్యర్థుల వివరాలు దిడ్డీ రమేష్ 135 ఓట్లు, భాషని ప్రకాష్ 128 ఓట్లు, సామల రవీందర్ 128 ఓట్లు, వనం దేవరాజు 14 ఓట్లు, బాసాని నవీన్ 100 ఓట్లు, దాసరి సమ్మయ్య 91 ఓట్లు, భాషని బాలకృష్ణ 90 ఓట్లతో గెలుపొందారు. చేనేత సహకార సంఘంలోని ఎన్నికైన అభ్యర్థి మాట్లాడు తూ సంఘం అభివృద్ధి కోసం సహాయ శక్తుల కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రవీంద్ర, రమాదేవి , లక్ష్మణ్ , నవీన్, అనిల్ ,పోలీసు సిబ్బంది అభ్యర్థులు పాల్గొన్నారు

# భద్రాద్రి రాముడిపై ఆన

- వచ్చే ఎన్నికల్లో 117 స్థానాల్లో గెలిచేది కాంగ్రెస్సే
- 2028 డిసెంబర్‌లో ఎన్నికలు ఉండవు.. 2029 జూన్‌లోనే పోలింగ్
- తెలంగాణలో పెరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు..
- ఎంపీ సీట్లు 26, ఎమ్మెల్యే సీట్లు 182కు పెంపు
- కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం
- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు
- పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కే పరిమితం చేశాం.. రాబోయే కురుక్షేత్రంలో గెలుపు మనదేనని ప్రకటన
- రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని వెల్లడి





అక్షరదర్బార్, ఖమ్మం: రాష్ట్రంలో ముందస్తు ఊహాగానాలకు తెరదించుతూ, భవిష్యత్ ఎన్నికలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో నిర్వహించిన "రైతు ఆశీర్వాద సభ" లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా తుది విడత నిధుల విడుదల, ఈ-పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు.

### 2029 జూన్‌లోనే ఎన్నికలు.. పెరగనున్న సీట్లు

రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారం 2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని సీఎం స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) ప్రక్రియ కారణంగా ఎన్నికలు 2029 జూన్ నాటికి జరుగుతాయని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 26 కు, అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 119 నుండి 182కు పెరుగుతాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### రాముడిపై ఆన.. 117 స్థానాల్లో జయకేతనం

"రాసిపెట్టుకోండి.. ఈ రోజు 2026 జూలై 10న నేను చెబుతున్న మాట ఖచ్చితంగా జరిగి తీరుతుంది. పెరిగే 182 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ రెండోసారి జయకేతనం ఎగురవేసి మళ్లీ అధికారంలోకి వస్తుంది. ఇది భద్రాచలం రాముడిపై ఆన.. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రతిజ్ఞ." అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాను గతంలో చెప్పిన జోస్యాలన్నీ నిజమయ్యాయని, అసెంబ్లీ ఎన్నికల్లో 65 సీట్లు వస్తాయన్న మాట, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండుసున్నా వస్తుందన్న మాట అక్షరాలా నిజమైందని గుర్తుచేశారు.

### కౌరవ వంశాన్ని పాతాళానికి తొక్కుతాం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని రాష్ట్ర రాజకీయాల్లో లేకుండా పాతాళానికి తొక్కుతామని హెచ్చరించారు. "తెలంగాణ ప్రజలను పీడించిన పాపాల భైరవుడిని (కేసీఆర్) ఎన్నికల్లో ఓడించి ఫాంహౌస్‌కు పరిమితం చేశాం, అక్కడే బంధించాం" అని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో జరగబోయే రాజకీయ కురుక్షేత్రంలో గెలిచేది ధర్మం వైపు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు.

### రైతు సంక్షేమమే మా శ్వాస..

ఖమ్మం జిల్లా తన రాజకీయ ఎదుగుదలకు గుండెకాయ లాంటిదని సీఎం రేవంత్ అభివర్ణించారు. నాడు 'వరి వేస్తే ఉరే' అన్న కేసీఆర్ పాలనకు, నేడు వరి పండించిన రైతుకు బోనస్ ఇస్తున్న కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను గమనించాలని కోరారు. గత బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, రైతులను రాజు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని సీఎం పునరుద్ఘాటించారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికతోనే సుస్థిర అభివృద్ధి

- సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




అక్షరదర్బార్, దామెర; గ్రామాల అవసరాలకు అనుగుణంగా రూపొందించే గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం దామెర మండలంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతాక్రమంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలు తమ పరిధిలోని సహజ వనరులు, స్థానిక ఆదాయ వనరులను గుర్తించి స్వంత ఆదాయాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థికంగా బలోపేతమైన గ్రామ పంచాయతీలతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, గ్రామసభల్లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరించాలని సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి అర్హులైన కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలిచ్చేలా సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి బీఎల్ఓలకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీనమాకాంత్, తాహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు